"అన్నది చాలక పైగా యిదొకటా? మేమూ మేమూ లక్ష అనుకుంటాం. హాస్య ధోరణిలో అనేకంజరుగుతాయి. మీకెందుకు?"

రాజ్యం నోట మాటలేదు. నే కలుగ చేసుకోక తప్పలేదు.

"మాకు తెలియదు దాసుగారూ. అందరూ మాలాగే వీధిని పడిపోతారనుకున్నాం. మాది తప్పే. మీ హాస్యధోరణి ఇంత వికృతంగా ఉంటుందనుకోలేదు."

"వికృతంగానా? ఆమాట మళ్ళీ అను."

"పోనీండి బాబూ, బహు సున్నితంగావుంది సరా? యిక మీరు వెళ్ళండి నాయనా."

"జరిగిందేదో జరిగింది - యీ సారి మా స్వవిషయాలలో కలుగచేసుకున్నారంటే మాటలతో సరిపోదు-రావే సూరీదూ."

ఆయన ముద్దుగా పిలవడం, అన్నేళ్ళ వచ్చిన సూరమ్మగారు 'ఆఁ!'అని వయ్యారంగా పలకడం దాసుగారి నడుం చుట్టూ చెయ్యివేసి సూరమ్మగారు నడిపించడం - ఎంత ప్రేమ!

ఎదురుగుండా గోడమీద రెండు పిల్లులు దెబ్బలాడుకుంటున్నాయి "అయ్యో ఎలా బకిరేసుకుంటున్నాయో" అంది రాజ్యం, "కాదు రాజ్యం. అదంతా సరసం. అందుకే పిల్లి దాంపత్యమంటారు" అన్నాను నేను.

# 'అర్ధాంగి' నిర్వచనం

"నాగశ్రీ"

ఈమధ్య నా స్నేహితుడొకడు చాల దినాలకు కనబడి "ఏంరా! అంతా క్షేమమేనా?" అని కుశలప్రశ్న వేశాడు. "ఏడిశావు. ఈమధ్యరోజుల్లో క్షేమాలేమిట్రా నీ తెలివి మాడిపోను" అనగానే వాడు బిత్తరపోయి చూశాడు. మరి అంతకంటె నేనేం జవాబుచెప్పేది? వుద్యోగం సంగతి చూద్దామా అంటే ఆఫీసరు చేతిలో రోజూ తిట్లే వచ్చే జీతం చూద్దామాఅంటే సంసారానికి పదిహేను రోజుల ఖర్చులకు చాలదు. వెనకటికి మా చిన్నాయనొకాయన అన్నాడులే "ఈకాలపు కుర్రవెధవలకు సంసారాన్ని పొదుపుగా ఎలా జరుపుకోవాలో తెలియనే తెలియదు. ఒకడు చెప్పినా గ్రహించుకొనేపాటి జ్ఞానమైనా లేదు. వచ్చేజీతం చాలకపోతే వేరే సంపాదన కెలాగైనా మార్గం చూడాలి. అదేమీ లేనే లేదు. మాకు చాలటంలేదండీ అని ఏడుస్తారు వెధవలు" మరి ఆయన చెప్పింది కూడ నిజమే. ఆయనలాగ బియ్యం బ్లాకు మార్కెట్టులో అమ్మి సంపాయించే మార్గం మాకెలాగ తెలుస్తుంది? ఎవరొచ్చి అడిగినా బియ్యం దొడ్డిదారిన అమ్ముతాడు గాని నేను పోయి "బాబాయ్ ఇంట్లో చాల ఇబ్బందిగా వుంది. రెండుశేర్ల బియ్యముంటే సర్దండి" అంటేసరి "అబ్బే లేవురా నాయనా. కావాలంటే చూసుకో ఈ ముందుగదిలో. ఈ రేషను బియ్యం ఏ మూలకొస్తాయిరా. అప్పటికీ మీ పిన్ని తెలివైంది గాబట్టి ఎలాగో నెట్టుకొస్తూంది" అంటాడు. నాకూ తెలుసు ముందుగదిలో ఏమీ వుండవని. అవి వుండే ప్రదేశాలే వేరు. వాటిని మాయంచేసే మార్గాలే వేరు. ఈ పరిస్థితుల్లో నాకేంచేయాలో పాలుబోయేదికాదు. అప్పటికీ నేను కొంత తెలివైనపనే చేశానన్న మాట. మాయింట్లో నేనూ, మా గృహిణీ చంటిపిల్లాడు మాత్రమే అయినా చనిపోయిన మా అమ్మా నాన్నను బ్రతికించి రేషనులెక్కల్లో చేర్పించా. ఎన్ని తంటాలుపడితే మాత్రం ఏం లాభం? ఇంట్లో సతీమణి నా అసమర్థతను గురించి చేసే రిమార్కులు మాత్రం తగ్గలా. ఈ ఆడాళ్ళతో వేగలేమురా బాబూ అనిపించింది. ఎక్కడ తిరిగినా, ఎన్నితంటాల్లుపడ్డా బియ్యం దొరక్కపోతే నన్నేం గంగలో దూకమన్నారా? విసుగెత్తిపోయింది ప్రాణం. ఆలోచించి ఆలోచించి పెద్ద రాజకీయ దురంధరుడి

ఎత్తువేశాను.

"ఏమండోయి"

"............"

"మిమ్మల్నే"

"............"

"గొంతు చించుకపోయేట్టు పిలుస్తున్నా పలకరేమండీ" అంటూ వంటింట్లోంచి వరండాలో కొచ్చింది.

"ఎన్ని పిలుపులు పిల్చినా తమకు గానట్టు కూర్చుంటారేం! ఇంట్లో రేపటికి మాత్రం బియ్యమున్నాయి. రేషనుకొర్డుమీద ఇంకా మూడురోజులకు గాని ఇవ్వరు. ఎక్కడైనా చూడండి ఇప్పట్నుంచీ"

"ఇదిగో శారదా! నన్ను విసిగించకు, ఇక ఈ బియ్యం గియ్యం సంగతి నాదగ్గరెత్తకు. ప్రాణాలు బేజారెత్తిపోతున్నాయి తిరిగితిరిగి"

"అదేమిటండీ అలాగంటారు? ఊళ్లో అందరికీ ఎలాగ దొరుకుతున్నాయి. ఇంట్లో మాత్రం మీ రుసరుసలకీ, కోపతాపాలకీ కొరవలేదు. బయటికిపోతే ఒక్కపని చెయ్యలేరు. ప్రక్కింటాయన చూడండి ఎలా పట్టుకొస్తాడో వస్తువులు."

"చాల్లే ఇక ఆపు. నాకు ప్రక్కింటాయన సంగతీ, వెనకింటాయన సంగతీ అవసరంలేదు. ఈ కష్టాల్నుండి మనం కొంచెం తేరుకోవాలంటే ఒకే ఒక వుపాయం వుంది."

"ఏమిటది" అంది ఆశగా.

"నువ్వెవరో తెలుసా?" అన్నా సీరియస్‌గా ముఖం పెట్టి.

"అదేమిటండోయి. అలా మాట్లాడుతున్నారు?" అంది బిత్తరపోయి.

"ఇస్. అనవసరపు మాటలు రానీకు. నీవు నా అర్ధాంగివి. తెలుసా."

"బలే బాగుందండీ మీ వరస. ఇంట్లో బియ్యంలేవని నే నేడుస్తూంటే 'నీవు నా అర్ధాంగివ'ని నాటకంలో నాయకుడిలా నటిస్తున్నారేమిటి" అంది పకపక నవ్వుతూ.

"శారదా. ఇది నవ్వులాటకు సమయం కాదు. నే చెప్తున్నా విను. అర్ధాంగివి అని నేను వూరికే అనలా. అర్ధాంగివి అంటే నా దేహంలో నీవు సగభాగమన్న మాట. అంటే నాలో సగమన్న మాట. కాబట్టి నేను చెప్పేదేమంటే నేను ఎంతన్నం తినగలనో అందులో సగభాగం మాత్రమే నీవు తినాలి. సినిమాకు నేను కుర్చీకెడితే నీవు బెంచీకెళ్ళాలి. అంతేగాని 'నేనుకూడ కుర్చీకి వస్తానండీ' అనకూడదు. ఇవన్నీ సంసారాన్ని పొదుపుగా జరుపుకోటానికి మార్గాలు" అన్నా.

"చాలా బాగున్నాయి మీ షరతులు. అవి మీకే చెల్లు." అంది కోపంగా మూతి బిగిస్తూ.

"శారదా నే చెప్తున్నా. ఈ సలహాలు పాటించావా సరే సరి. లేదా మనిద్దరికీ మన స్పర్ధలు పెరగటమే కాకుండా నేనిక బియ్యం సంగతి పట్టించుకోను. నామట్టుకు నే నెల్లాగో హోటల్లో భోంచేస్తా" అన్నా.

"సరే అలాగే నడుచుకుంటా లెండి" అంది నిట్టూరుస్తూ. అప్పుడు నా ఆనందాన్ని నేను వర్ణించటంగాదు, కాళిదాసాది మహాకవులు ఆ సమయంలో నా దగ్గరుండి నన్ను గమనిస్తూ వర్ణించాల్సిందే. నా కళ్ళముందొక్కసారి మహా పతివ్రతలైన సావిత్రి, అనసూయ, సీత మొదలైన వారంతా గిర్రున తిరిగారు. వాళ్ళతో సమాన హక్కుల్ని నా శారద సంపాదించుకున్నట్టు ఫీలయ్యానేను. అబ్బ! సంసారంకోసం శారద ఎంత త్యాగం చేసింది! అనుకుని మురిసిపోయా.

మూడోనాడు నిద్రలేచి ముఖం కడుక్కుని తుడుచుకుంటూ వరండాలో కొచ్చి కుర్చీలో కూచున్నా కాఫీమాతను పూజిద్దామని. ఇంతలో మా ఆవిడ హడావుడిగా రెండు గిన్నెలు పట్టుకొచ్చి నాముందు పెట్టింది. ఒకగిన్నెలో పాలు, మరో గిన్నెలో డికాక్షన్ వున్నాయి. "ఏమండోయ్ మరేమనుకోకండి. పిల్లవాడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. కొంచెం కాఫీ కలుపుతూండండి. పాలిచ్చి వస్తా" బ్రతిమాలుతున్నట్లు ఆ మాట అని లోపలికి పోయింది నేను తలెత్తి చూసేలోగా. పాపం! చంటివాడితో సతమతమవుతూందనుకొని కాఫీ కలిపి ఒక గ్లాసులో పోసుకొని ఒక గుటక వేశా. చప్పగా వున్నాయి.

"శారదా! చక్కెర కలపనేలేదే! చప్పగా ఏడుస్తున్నాయి కాఫీ. త్వరగా చక్కెర తీసు

కరా!" అని కేకేశా.

"నే పిల్లాడికి పాలిస్తున్నాను. మీరే కొంచెం లేచి అందుకోండీ మరేమనుకోకుండా" అంది తీరిగ్గా ముద్దుగా పలుకుతూ. శారదకు నామీదవున్న గౌరవానికి ప్రేమకు పుబ్బి తబ్బిబ్బులైపోయా. చక్కెర డబ్బా తెచ్చుకొని కాఫీలో కలుపుకొని ఎలాగో త్రాగేశా. ఆ పని చేసేప్పటికి నాకు కుస్తీపట్టినంత పనయింది. తరువాత రెండు మూడు రోజులకు గాబోలు ఉదయం తొమ్మిది గంటలప్పుడు పేపరుచదువుకుంటూ కూర్చున్నా. శారద మెల్లిగా వచ్చి కొన్ని వంకాయలు, కత్తిపీట నా కుర్చీ దగ్గర పెట్టిపోయింది. కొంచెం సేపటికి నేను వాటిని చూసి శారదను కేకేశా. శారద మెల్లిగావచ్చి "ఎందుకండీ" అంది చిరునవ్వుతో. నాకా నవ్వులో ఏదో కొంటె తనం కనిపించింది.

"ఇవెందుకు శారదా ఇక్కడ పెట్టావు? లోపలికి తీసుకెళ్ళి త్వరగా వంట కానీయి. ఆఫీసు టైమవుతోంది" అన్నా.

"వాటిని మీరే కొంచెం కోసి ఇద్దురూ" అంది. ఇంకా ఆ నవ్వులో మార్పేమీలేదు.

"ఏమిటా పరిహాసం? త్వరగా కానీయ్" అన్నా పేపరులో మరో పేజీ తిప్పుతూ.

"పరిహాసం కాదండీ. నా భాగం పని పూర్తయింది. ఇక మీభాగం మాత్రమే కొరవగా వుంది."

"నా భాగమేమిటి?"అన్నా ఆశ్చర్యంగా.

"అదేనండీ. మీసగభాగం.మీరుచెప్పిందేగా అర్ధాంగిఅంటేసగభాగమని. అందుకని నాభాగం అన్నం వండటం మాత్రం జేశాను. ఇక మీ సగభాగం మాత్రమే వుంది, కూరలు వండటం. మీరే అన్నంవండే భాగం తీసుకుంటానంటే రేపటినుండి అలాగే చేద్దాం"అని మెల్లగా అంది. నాగుండె రెండుక్షణాలుఆగిపోయినట్లేఫీలయ్యా. తరువాత తేరుకుని,నింపాదిగా కోపం తెచ్చుకుని "శారదా! ఏడిసినట్లేవుంది నీ అర్థం. త్వరగా వంటకానీయి పిచ్చిపిచ్చి పనులు చేయకుండా. నాకు ఆఫీసు టైమవుతూంది" అన్నా పెద్దగా.

"ఏమిట్రోయ్ అంత పెద్దగా కేకలు వేస్తున్నావు?" అంటూ లోపలకి వచ్చాడు సుబ్రహ్మణ్యంగాడు. నాకు వాడిని చూడగానే నమిలి మింగేయాలన్నంత కోపం వచ్చింది. పానకంలో పుడకలాగా మధ్య వీడు దాపురించాడు మన ఎత్తులు సాగకుండా అని వాణ్ణి తిట్టుకుంటున్నా మనసులో. నా గృహిణి సాగదీసుకుంటూ చెప్పడం మొదలెట్టింది. "చూడన్నయ్యా! ఆయన చేసేపనులు. బియ్యం చాలటం లేదంటే 'నీవు నా అర్ధాంగివి అంటే సగం దేహానివి కాబట్టి, నే నెంతన్నం తింటానో అందులో సగం మాత్రమే తినాలి. సినిమాల్లో నేను కుర్చీకెడితే నీవు బెంచీ కెళ్ళాలి. ఇవన్నీ ఆర్థికంగా సంసారపు ఇబ్బందుల్ని తగ్గించుకోటానికి మార్గాలు' అని చెప్పారు. నేను సరేనని ఒప్పుకున్నా. వారు జెప్పిన పంపిణీల ప్రకారమే ఈ పూట నేను అన్నం వండేశాను. ఇక కూరల పని వారి దంటావా కాదా? ఈ మాటనే నన్నందుకు నామీద ఎగిరిపడ్తున్నారు?" మావాడు కూరగాయల వైపొకసారి చూసి ఇల్లదిరేటట్టు నవ్వుతూ "ఒరేయి! అర్ధాంగి అనే పదానికి సరైన నిర్వచనం ఇచ్చావురా! నీప్రజ్ఞా విశేషాలు ఇలా గుమాస్తా గిరిలో వృథాపోవడం నిజంగా శోచనీయం" అంటూ చిన్న లెక్చరు గొట్టి శారదవైపు తిరిగి "నువ్వింకా కొంచెం గౌరవ మిచ్చావమ్మాయి వీడికి. ఇల్లు వూడ్చడం, అంట్లు తోమడంలోకూడ భాగాలు పెట్టాల్సింది" అన్నాడు. ఇంతకీ వాళ్ళిద్దరిమధ్యా నేనొక మొద్దబ్బాయి ననిపించుకున్నా. కాని మనం అలాంటి దెబ్బలకే లొంగిపోతే ఇంతపెద్ద ఎత్తెలా వేస్తాం? పకపక నవ్వుతూ లేచి "సరే లేరా ఏదో చిన్న నాటకమాడాను. పాపం పిచ్చిపిల్ల నాలుగైదు రోజులుసగంఅన్నంతినిమాడిపోయింది"అన్నా.

"ఇక్కడ సగం అన్నంతిని మాడిపోయిన వాళ్లెవరూ లేరు. ఈ నాలుగైదురోజులూ మరీ సుష్టుగా భోంచేశా నేను"అని శ్రీమతి నవ్వుతూ అంటూంటే నేను తెల్లమొఖం వేయక తప్పింది కాదు.